


ఆరోగ్య బీమా చెక్కుల పంపిణీ

శిడ్లఘట్ట, జూన్ 30: ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి ట్రస్టు తాలూకా కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య రక్షా బీమా చెక్కులను పంపిణీ చేశారు. సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ సీఎస్ మాట్లాడుతూ డాక్టర్ వీరేంద్రహెగ్డే దూరదృష్టితో స్వసహాయ బృందాలకు సంపూర్ణ సురక్షా, ఆరోగ్య రక్షా కార్యక్రమంలో నమోదు చేసుకున్న సంఘ సభ్యులకు ఆరోగ్యబీమా వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలో ఏ ఆసుపత్రి లో ఇన్‌పేషంట్‌గా చేరి చికిత్సలు పొందినా గరిష్ఠంగా రూ.20వేల వరకు బీమా మొత్తం ఇస్తారన్నారు. ఇలా ఇంతవరకు రూ.1.07 కోట్లు బీమా మొత్తం విడుదల చేసినట్టు తెలిపారు.

తగ్గిన ఆహారధాన్యాల సాగు



పంటలంటే ఒకప్పుడు ఆహార ధాన్యాల సాగే ముఖ్యమైనవి. కాలానుగుణంగా వాణిజ్య పంటల రాకతో ఆహార ధాన్యాల సాగు అంతరించిపోతోంది. ఆహార పంటలకు మితిమీరిన పెట్టుబడులు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు సరిగా లేకపోవడంతో రైతులు ఏటేటా నష్టాలు మూటగట్టుకునే పరిస్థితులు నెలకొన్నాయి. వరి పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరలు, ప్రోత్సాహకాలు ప్రకటించినా గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. గత పదేళ్లలో వరి సాగు గణనీయంగా పడిపోగా.. వాణిజ్య పంట వక్కసాగు రెట్టింపయింది. ప్రభుత్వాలు దృష్టి సారించకపోతే ఆహార ధాన్యాలు కొరవడి తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశాలు లేకపోలేదు.



- గణనీయంగా పడిపోయిన వరి పంట
- జొన్న రాగి అంతంత మాత్రమే
- కందిని వదిలేసి సోయాపై మొగ్గు
- వాణిజ్య పంటలపై అన్నదాత ఆసక్తి
- రెట్టింపయిన వక్క పంట

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. ఐదేళ్లలో గత ఏడాది మాత్రమే కరువు నెలకొంది. మిగిలిన నాలుగేళ్ల రాష్ట్రంలో సంతృప్తికరమైన వర్షాలు కురిసినా సాగు విస్తీర్ణం తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయశాఖ సమాచారం మేరకు 2020-21 సంవత్సరంలో 84.96 లక్షల హెక్టార్లలో ఆహారధాన్యాలు సాగు అయ్యేవి. ప్రస్తుతం 75.64 లక్షల హెక్టార్లకు తగ్గింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలో ఆహారధాన్యాల సాగు విస్తీర్ణం 10లక్షల హెక్టార్లు వాణిజ్య పంటలు, ఇతరత్రా ప్రయోజనాలకు మార్పు జరిగింది. ఆహార ధాన్యాల విస్తీర్ణం వక్కసాగు వైపు మరలుతోంది. ప్రధానంగా దక్షిణకన్నడ, చిక్కమగళూరు, దావణగెరె, శివమొగ్గ జిల్లాల్లో వక్కసాగు గణనీయంగా పెరుగుతోంది. 2018లో 2.79 లక్షల హెక్టార్లలో ఉన్న వక్కసాగు 2023 నాటికి 7,31,650 హెక్టార్లకు పెరిగింది. వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 8.50 లక్షల హెక్టార్లకు వక్కసాగు విస్తీర్ణం పెరిగింది. రాష్ట్రంలో దశాబ్దాల కాలంగా వరిసాగు అధికంగా ఉండేది. అందుకు పలు ప్రాజెక్టులు, నదులు ప్రవాహానికి అనుబంధంగా చెరువులు ఉండడమే కారణం. వరిసాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది. 2020-21లో 15.14 లక్షల హెక్టార్లలో వరిసాగు చేశారు. 2023-24లో 10.56 లక్షల హెక్టార్లు మాత్రమే లక్ష్యంగా కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడం, ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో నాట్లు వేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇక ఉత్తరకర్ణాటక ప్రాంతంలో ప్రధాన ఆహారమైన జొన్నసాగు విస్తీర్ణం కూడా తగ్గుముఖం పడుతోంది. 2019-20లో 9.14 లక్షల హెక్టార్లలో జొన్నసాగులో ఉండేది. గత ఏడాదికి 6.82 లక్షల హెక్టార్లకు తగ్గింది. ఉత్తరకర్ణాటక ప్రాంతంలోని హావేరితోపాటు పలు జిల్లాలలో వక్కసాగు ప్రారంభమైంది. గతంలో వక్కసాగు ఉత్తరకర్ణాటక ప్రాంతంలో ఎక్కడా ఉండేది కాదు. కందిసాగు పట్ల మరింత నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2021లో 17.54 లక్షల హెక్టార్లలో కంది సాగయింది. ప్రస్తుతం కంది 4 లక్షల హెక్టార్లు తగ్గింది. 2023-24లో 13.93 లక్షల హెక్టార్లలో మాత్రమే కంది సాగు చేశారు. రాష్ట్రంలోని కలబురగి, బీదర్‌తోపాటు అనుబంధ జిల్లాలకు కంది ఖనిజం అనే పేరుండేది. కానీ ఇటీవలి కాలంలో కంది సాగును వదిలేస్తున్న రైతులు సోయా సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయశాఖ కందిసాగు విస్తీర్ణం పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. రాష్ట్రంలో భిన్నమైన ఆహారశైలి ఉంది. పాతమైసూరు జిల్లాలో అన్నం ఎక్కువగా తీసుకుంటారు. బెంగళూరు, చిత్రదుర్గ, తుమకూరు, కోలారు, మండ్య, మైసూరు, చామరాజనగర, రామనగర, హాసన్ ప్రాంతాల్లో అన్నంతోపాటు రాగి సంగటి తినే అలవాటు ఉంది. తీరప్రాంత జిల్లాలతోపాటు చిక్కమగళూరు, కొడగు ప్రాంతాల్లో కేరళ ప్రాంతంలో పండించే లావుబియ్యం తినే అలవాటు ఎక్కువ. ఇక ఉత్తరకర్ణాటక ప్రాంతమంతటా జొన్న రొట్టె తినే అలవాటు ఎక్కువ. ఈ ప్రాంతంలో జొన్నతోనే సంగటి, రొట్టె ఇతరత్రా పదార్థాలు చేస్తుంటారు. బియ్యం కూడా వాడుతారు. ఇలా ప్రాంతాలవారీగా వారు తీసుకునే ఆహారానికి అవసరమైన ధాన్యపు గింజలను సాగు చేసే సంప్రదాయం దశాబ్దాల కాలంగా వస్తోంది. రాష్ట్రంలో వక్కసాగు కూడా అధికంగానే ఉంది. దేశంలోనే కర్ణాటక వక్కసాగులో కీలకమైనది. నిరంతర వర్షాలు, గాలిలో తేమశాతం కలిగి ఉండి భారీగా ఎండలు లేని ప్రదేశం వక్కసాగుకు అనుకూలమైనది. దీంతో వాణిజ్య పంటగా తుమకూరు, శివమొగ్గ చిక్కమగళూరు, కొడగుతోపాటు వివిధ జిల్లాల్లో సాగు చేస్తారు. ఇవే జిల్లాల్లో కొండగుట్టలతోపాటు సాధారణ భూముల్లోనూ కాఫీ సాగు చేసే సంప్రదాయ ఉంది. వాణిజ్యపంటల సాగువైపు రైతులు ఆసక్తి చూపడానికి సాగుఖర్చులు పెరగడం, అందుకు తగినట్టుగా కూలీలు లభించకపోవడం వంటి కారణాలతో వాణిజ్యపంటలవైపు వెళ్తున్నారు.


సజ్జ పంట


రాగి పంట

ఏపుగా పెరిగిన వక్కతోట


రాష్ట్రంలో 51శాతం విత్తనం

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వర్షాలు ఉత్తమంగా ఉన్నాయని ఇప్పటి వరకు 51శాతం విత్తన పనులు జరిగినట్టు వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి తెలిపారు. ఇంకా 20 రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో విత్తన గింజలు, రసాయన ఎరువుల కొరత లేదన్నారు.



చెన్నపట్టణకు అభ్యర్థులు ఎవరో..?

- తెరపైకి కొత్త పేర్లు
- అందరి చూపు ఇటువైపే
- నేటి నుంచి మూడు రోజులు డీకే పర్యటన

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలుగా కొనసాగుతూ ముగ్గురు నేతలు లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఖాళీ అవుతున్న శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలో పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. అన్నింటికంటే చెన్నపట్టణ నుంచి ఎవరు పోటీలో ఉంటారనే అంశం ఆసక్తికరంగా మారింది. ఇక్కడ అభ్యర్థికి సంబంధించి రోజుకో కొత్తపేరు తెరపైకి వస్తోంది. చెన్నపట్టణ ఎమ్మెల్యేగా ఉన్న హెచ్‌డీ కుమారస్వామి ఇటీవల ఎన్నికల్లో మండ్య నుంచి లోక్‌సభకు ఎన్నికై కేంద్రంలో మంత్రి అయ్యారు. హావేరి జిల్లా శిగ్గావి ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్‌బొమ్మై హావేరి నుంచి ఎంపీ అయ్యారు. బళ్లారి జిల్లా సండూరు ఎమ్మెల్యేగా ఉన్న ఇ. తుకారాం బళ్లారి ఎంపీగా ఎన్నికయ్యారు. బళ్లారి విషయమై అంతగా ప్రస్తావన లేదు. సీనియర్ నేత బసవరాజ్ బొమ్మై వరుసగా గెలుపొందతూ వచ్చిన శిగ్గావిని వదులుకునేందుకు ఇష్టం చూపడం లేదు. ఈ స్థానంనుంచి కుమారుడు భరత్‌కు టిక్కెట్ సాధించడం ద్వారా రాజకీయ ప్రవేశం కల్పించాలని భావిస్తున్నారు. భరత్ పారిశ్రామికవేత్తగా కొనసాగుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాలకంటే అందరి దృష్టి చెన్నపట్టణపైనే ఉంది. చెన్నపట్టణ నుంచి కుమారస్వామి వారసుడు నిఖిల్ పోటీ చేస్తారనే ప్రచారం సాగింది. అయితే ఆచితూచి అడుగు వేయాలని దేవెగౌడ కుటుంబం భావిస్తోంది. నిఖిల్ 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ, 2023లో శాసనసభ ఎన్నికల్లోనూ ఓడిపోయారు. ప్రస్తుతం చెన్నపట్టణ నుంచి పోటీ చేస్తే ప్రత్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటారని వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. వారం రోజులపాటు జేడీఎస్ - బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా నిఖిల్ పేరు హల్‌చల్ చేసినా కేంద్రమంత్రిగా కుమారస్వామి చెన్నపట్టణలో పాల్గొన్న తొలిసభలో నిఖిల్ పోటీ చేయబోరని స్పష్టం చేశారు. ఇదే నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత సీపీ యోగేశ్వర్ పోటీ చేస్తే సంపూర్ణంగా సహకరిస్తామని కుమారస్వామి ప్రకటించారు. చెన్నపట్టణ తన సొంత నియోజకవర్గమని, ఇక్కడి నుంచే రాజకీయాలు ప్రారంభించానని, తానే పోటీ చేస్తానని కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇటీవల ప్రకటించారు. ఇదే సమయంలో చెన్నపట్టణలోని 14 ఆలయాలను ఒకేరోజు దర్శించుకున్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీలోనే అభ్యంతరాలు రావడంతో బెంగళూరు గ్రామీణ నుంచి ఓటమి చెందిన డీకే సురేశ్ ఇక్కడ అభ్యర్థి అవుతారనే ప్రచారం సాగింది. కానీ డీకే సురేశ్ తాను పోటీలో ఉండడం లేదని ప్రకటన చేశారు. ఎన్నికల్లో ఓడిపోయి నెలరోజులు కాలేదని, ప్రజలు విశ్రాంతి తీసుకోవాలని హెచ్చరించారని, ఈలోగానే ఎన్నికలకు వెళ్తే సమంజసంగా ఉండదని, చెన్నపట్టణ నుంచి పోటీ చేసేది లేదని స్పష్టం చేశారు. దీంతో డీకే సురేశ్ కూడా పోటీలో ఉండరనేది స్పష్టమైంది. డీకే శివకుమార్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండడంతో ఆసక్తికరంగా మారింది. ఆయన కుమార్తె ఐశ్వర్య పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అందుకు డీకే శివకుమార్ తమ కుటుంబం నుంచి మరెవ్వరూ రాజకీయాల్లోకి రాబోరంటూ స్పష్టం చేశారు. ఆ తర్వాత రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోయిన కుసుమ అభ్యర్థి అవుతారని ప్రచారం జరిగింది. ఇదే సమయంలో జేడీఎస్ నుంచి తాజాగా బెంగళూరు గ్రామీణ ఎంపీ మంజునాథ్ భార్య, కేంద్ర మంత్రి కుమారస్వామి సోదరి అనసూయమ్మ పేరు తెరపైకి వచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందోగానీ అభ్యర్థుల పేర్లు మాత్రం హల్‌చల్ చేస్తున్నాయి.





నేటి నుంచి మూడు రోజులు డీకే పర్యటన

చెన్నపట్టణ నియోజకవర్గంపై కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. పది రోజుల వ్యవధిలో మూడుసార్లు పర్యటించారు. అంతకు ముందు నెలల కాలలమైనా చెన్నపట్టణకు వెళ్లిన సందర్భాలు లేవు. చెన్నపట్టణ ఎమ్మెల్యే స్థానానికి ఉప ఎన్నికపై దృష్టి సారించడంతోనే ప్రాధాన్యత ఇస్తున్నారు. తొలుత ఒకే రోజున 14 ఆలయాలను సందర్శించారు. ఆ తర్వాత ఇంటి ముంగిట ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని రెండు గ్రామపంచాయతీల పరిధిలో రెండు సభలు జరిపి వేలాదిమంది నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం నుంచి వరుసగా మూడు రోజులపాటు చెన్నపట్టణలోనే పర్యటిస్తున్నారు. సోమవారం విరూపాక్షపుర పంచాయతీ పరిధిలో జనస్పందనలోనూ, మంగళవారం మలూరు పంచాయతీ పరిధిలోనూ, బుధవారం చెన్నపట్టణ టౌన్‌లో జనస్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

కాంగ్రెస్‌లో ముదురుతున్న వర్గపోరు

- నేడు కేపీసీసీ పదాధికారుల భేటీ
- మూడేళ్ల డీకే సాధనలపై చిత్ర ప్రదర్శన
- సీఎం హాజరు ప్రశ్నార్థకం
- షెడ్యూల్‌లో కనిపించని సమావేశం

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల మధ్య వర్గపోరు ముదురుతోంది. వారం రోజులుగా డీసీఎంల సంఖ్య పెంచాలని, మరిన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించాలనే డిమాండ్ మలుపులు తిరుగుతోంది. మూడు రోజులుగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం, డీసీఎం బెంగళూరుకు వెనుతిరిగారు. ఆదివారం మధ్యాహ్నం దాకా ప్రస్తావన లేని కేపీసీసీ పదాధికారుల సమావేశం ఉన్నఫలంగా ఏర్పాటు చేయనుండడంలో అంతర్యమేమిటోనని చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కేపీసీసీ అధ్యక్షుడిగా మూడేళ్లుగా కొనసాగుతున్న డీకే శివకుమార్ తన సాధనలపై ప్రత్యేక షార్ట్ ఫిలింను రూపొందించారు. సోమవారం ఉదయం 10 గంటలకు కేపీసీసీలో పదాధికారుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేపీసీసీకి సంబంధించి 190 మంది పదాధికారులను సమావేశానికి ఆహ్వానించారు. ఢిల్లీ నుంచి ఆదివారం వెనుతిరిగి వచ్చిన తర్వాత డీకే శివకుమార్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య బెంగళూరులోనే ఉన్నా కేపీసీసీ సమావేశంలో పాల్గొనేలా షెడ్యూల్ ఖరారు కాలేదు. ముఖ్యమంత్రిని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. కానీ షెడ్యూల్‌లో లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. డీసీఎంల సంఖ్య పెంచాలని పలువురు మంత్రులు చేసిన ప్రతిపాదనలతో రాజకీయ దుమారం రేగుతోంది. తర్వాత స్వామిజీలు తెరపైకి వచ్చారు. తాజాగా ముఖ్యమంత్రి మార్పు జరిగితే తీవ్రస్థాయిలో పోరాటాలు చేస్తామని అహింద రాష్ట్ర అధ్యక్షుడు ప్రభులింగ దొడ్డమని తెలిపారు. హుబ్బళ్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల సీఎంగా సిద్దరామయ్య ఉండాలని, ఆయన వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రికి అహింద అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రజలు సిద్దరామయ్యను చూసి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని పేర్కొన్నారు.

తాజా రాజకీయాలపై ఖర్గేతో డీకే సమాలోచనలు

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆదివారం ఢిల్లీలో ఖర్గే నివాసానికి డీకే శివకుమార్ వెళ్లి పలు అంశాలపై చర్చించారు. మూడు రోజులపాటు సీఎం, డీసీఎం ఢిల్లీలోనే బస చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఢిల్లీ నుంచి బెంగళూరుకు వెనుతిరిగి వచ్చిన డీకే శివకుమార్ శనివారం మరోసారి వెళ్లారు. సీఎం, డీసీఎంలు శనివారం రాత్రి ప్రధానమంత్రి నరేంద్రమోదీని భేటీ అయిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రాత్రే బెంగళూరుకు చేరుకోగా డీసీఎం మాత్రం అక్కడే ఉన్నారు. ఖర్గేతో సుదీర్ఘ సమయం డీసీఎం చర్చలు జరిపినట్టు సమాచారం. ఇటీవల డీసీఎం హోదాలు మరింతమందికి ఇవ్వాలనే ప్రస్తావన, నాయకత్వ మార్పు, కేపీసీసీ అధ్యక్షుల మార్పు వంటి ప్రస్తావనలు వస్తున్న తరుణంలో డీకే శివకుమార్, ఖర్గేను కలసి చర్చించడం కీలకమవుతోంది. దీనికితోడు మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికల అభ్యర్థుల అంశం కూడా ప్రస్తావించినట్టు సమాచారం.



ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేతో డీకే శివకుమార్


కన్నడ సినిమాలకు ప్రోత్సాహం


సినీ నిర్మాతల సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

- మైసూరులో ఫిలింసిటీకి చర్యలు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కన్నడ సినిమాలకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. ఆదివారం ఆయన కుమారపార్కు వద్ద నిర్మాతల సంఘాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కన్నడ సినిమా రంగానికి దశాబ్దాలకాలంగా ప్రభుత్వం అన్ని విధాలా సహకారాలు అందిస్తోందని, ఇదే విధానం భవిష్యత్తులోనూ కొనసాగుతుందన్నారు. నిర్మాతల సంఘానికి ఇప్పటి వరకు సొంత భవనం లేదని, శాశ్వతంగా నిర్మాతలకు ఓ వేదిక ఉండాలనే ఏర్పాటు చేశామన్నారు. 1982 నుంచి కన్నడ చలనచిత్ర నిర్మాతల సంఘం అనేకమైన కార్యక్రమాలు చేస్తోందని, నిర్మాతలందరికీ ప్రత్యేక అభినందనలు అన్నారు. ఢిల్లీ పర్యటన నుంచి ఈ కార్యక్రమం కోసమే బెంగళూరుకు వచ్చానని తెలిపారు. నిర్మాతల సంఘానికి ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఓటీటీ వేదికకు సంబంధించి పరిశీలన చేస్తామని అన్నారు. మైసూరులో ఫిలింసిటీ నిర్మాణానికి పీపీపీ తరహాలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫిలింసిటీ డాక్టర్ రాజ్‌కుమార్ కలగా ఉండేదని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జగ్గేశ్, నటుడు శివరాజ్‌కుమార్, కర్ణాటక చలనచిత్ర అకాడమీ అధ్యక్షుడు సాధుకోకిల, నిర్మాతల సంఘం అధ్యక్షుడు ఉమేశ్ బణకార, చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు ఎన్ఎం సురేశ్, భామా హరీశ్, సా రా గోవిందు తదితరులు పాల్గొన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.48	1,577.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	6308	343
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	296	2,609
సామర్థ్యం (టీఎంసీలు)	5.79	3.29

కళాసంస్కృతిని కాపాడుకోవాలి



జ్యోతి వెలిగిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు

బళ్లారి సిటీ, జూన్ 30: తరతరాలుగా వస్తున్న భారతీయ కళాసంస్కృతిని కాపాడుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ బళ్లారి జిల్లా అధ్యక్షుడు మహారుద్రగౌడ పేర్కొన్నారు. బళ్లారిలో ఆదివారం జరిగిన తుంగ-గంగా సాంస్కృతిక కళాట్రస్టు వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతోపాటు కళలపై మక్కువ పెంచాలన్నారు. ఈసందర్భంగా విరూపాక్షప్పకు సహకార రత్న, డా.శ్రీనాథ్‌కు, శ్రీధర్‌కు, రామచంద్రకు తుంగా ఉగాది పురస్కారం, మహారుద్రగౌడ, గోవిందరెడ్డి, భద్రీనారాయణలకు తుంగా వాణిజ్య రత్న పురస్కారాన్ని అందజేశారు. అలాగే రవిచెళ్లగుర్కికి సర్వేపల్లిరాధాకృష్ణ శిక్షక పురస్కారం, కిరణ్‌కుమార్‌కు సమాజ సేవా రత్న, అర్చనా, వైష్ణవి, జ్యోతిక, అర్చనకట్టి, మన్యతా, వలిఅహమ్మద్‌లకు కళారత్న పురస్కారాలు అందజేసి సత్కరించారు. రాధాకృష్ణ బృందం ప్రదర్శించిన బాలక్రిష్ణ లీలా నాటిక, అర్చనా బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శన, రంగారెడ్డి బృందం సుగమసంగీత ఆలాపన, వైష్ణవి బృందం జానపద కోలాటప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాకారులు నాగభూషణ్, శివరుద్రయ్యస్వామి, రామచంద్ర, తోటకూరి శ్రీనివాసరావ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అక్రమ విక్రయాలపై దాడులు



దుకాణాలపై దాడులు చేస్తున్న అధికారులు

బళ్లారి సిటీ,జూన్ 30: సండూర్ తాలూకాలో ఆదివారం పలు దుకాణాలపై దాడులుచేసి అక్రమంగా పొగాకు విక్రయిస్తున్న బాలకార్మికులను గుర్తించామని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనిల్‌కుమార్ చెప్పారు. సండూరు పట్టణంలోని పాన్‌షాపులు, హోటళ్ళు, గ్యారేజీ తదితర ప్రాంతాలను సందర్శించి తనిఖీలు నిర్వహించి నో స్మోకింగ్ బోర్డులు పెట్టాలని సూచించారు. అలాగే బాలలు, కౌమార చట్టం 2016 ప్రకారం రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖ, విద్యాశాఖ మొత్తం 11శాఖల అధికారులు పాల్గొని పిల్లలు ఏవిధంగానూ కూలీలుగా మారకుండా అడ్డుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణంలోని 14దుకాణాలపై దాడులు నిర్వహించి పలు ఉల్లంఘనలకు పాల్పడిన దుకాణాలకు రూ.3400 జరిమానా విధించారు. ఈసందర్భంగా మున్సిపల్ చీఫ్ జయన్న, లేబర్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, వెనుకబడిన తరగతుల అధికారి కొట్రేశ్, బాలల సంరక్షణ విభాగం శాఖాధికారి భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు హళకట్టి జయంతి

బళ్లారి సిటీ,జూన్ 30: కన్నడ సాంస్కృతిక శాఖ, నగరపాలిక ఆధ్వర్యంలో జూలై 2వ తేదీ ఉదయం స్థానిక రాజ్‌కుమార్ రోడ్డులోని కన్నడ సముదాయ భవన ఆవరణలో హళకట్టి జయంతి నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి జిల్లామంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌తో పాటు ఎమ్మెల్యేలు హాజరవుతారని వెల్లడించారు.

కోర్టు నూతన భవనాలకోసం కసరత్తు

హోసూరు(కృష్ణగిరి), జూన్ 30: కృష్ణగిరి జిల్లాలో కోర్టు భవనాల పనుల, ప్రాథమిక అవసరాలు, నూతన భవనాల నిర్మాణంపై కోర్టు ప్రాంగణంలో ఏర్పాటైన సమావేశంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జె.సత్యనారాయణ ప్రసాద్ పాల్గొని చర్చించారు. ఎంఎం సుమతి సాయిప్రియ, కలెక్టర్ కె.ఎం.సరయు కూడా పాల్గొన్నారు.

పాత ప్రహరీ రాళ్లతో కొత్త గోడ

రూ. 61 లక్షల డీఎంఎఫ్ నిధులు వృథా



బళ్లారి గాంధీనగర్, జూన్ 30: జిల్లా మైనింగ్ ఫండ్(డిఎంఎఫ్) నిధుల ద్వారా నగర ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనుకునే ఉద్దేశ్యం మంచిదైనా, నిబంధనలు మరిచి నిధులు వృథా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రస్తుతం పైన కనిపిస్తున్న దృశ్యాలే అద్దం పడుతున్నాయి. రాష్ట్రంలో అత్యధిక ఖనిజ నిక్షేపాలున్న జిల్లాల్లో బళ్ళారి జిల్లా మొదటి స్థానంలో నిలుస్తుంది. దీంతో ఇతర జిల్లాలతో పోలిస్తే బళ్ళారికి ఖనిజ నిధులు (డిఎంఎఫ్)పుష్కలంగా లభిస్తున్నాయి. బళ్ళారికి డిఎంఎఫ్ అక్షయ పాత్రగా చెప్పుకోవచ్చు. జిల్లా పరిధిలోని విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల అభివృద్ధికి ఈ నిధులను ఖర్చు చేస్తారు. డిఎంఎఫ్ నిధుల ప్రణాళికకు జిల్లాధికారి అనుమతి తప్పనిసరి. అయితే ఒకే స్థలంలో రెండు వేరువేరు పనుల పేరుతో డిఎంఎఫ్ నిధులు ఖర్చుచేస్తుండడం విడ్డూరంగా ఉంది.

నగరంలో రాయల్ సర్కిల్ నుండి ఇందిరా సర్కిల్ వరకు ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులకు కోట్లాది రూపాయలు జిల్లా ఖనిజ నిధులు ఖర్చు చేస్తున్నారు. రోడ్డు విస్తరణ మాటున డిఎంఎఫ్ నిధులు వృథా అవుతున్నాయి. రాయల్ సర్కిల్ నుండి సంగం సర్కిల్ దారిలో వరకు 400 మీటర్ల రోడ్డును విస్తరించడానికి సుమారు రూ. 5 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. ఈ రోడ్డులోనే పాతమున్సిపల్ కళాశాలకు చెందిన 150మీటర్ల మేర ప్రహరీ గోడను తొలగించి డ్రైనేజీని నిర్మించారు. రోడ్డు అభివృద్ధికి కేటాయించిన నిధులతోనే కొత్తగా ప్రహరీ గోడను నిర్మించే అవకాశం ఉన్నా... అధికారులు మాత్రం 150 మీటర్ల ప్రహరీకి అదనంగా రూ 61 లక్షలు డిఎంఎఫ్ నిధులు ఖర్చుచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది.

కొత్తగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను స్థానిక 'నిర్మిత కేంద్ర' సంస్థకు అప్పగించారు. పనులు చేపట్టిన నిర్మిత కేంద్రం అధికారులు కొత్త ప్రహరీ గోడ నిర్మాణానికి గతంలో ఉపయోగించిన పాత రాళ్ళు మినహా... కొత్తగా ఒక్క రాయికూడా కొనలేదు. అందులో పునాదులు లేకుండా ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యాభివృద్ధికి అవసరమైన శాశ్వత మౌలిక సౌకర్యాల కోసం ఉపయోగించాల్సిన నిధులను అధికారులు ఈ విధంగా ప్రహరీగోడల నిర్మాణానికి ఉపయోగించి వృథా చేస్తున్నట్లు నగర ప్రజలు అంటున్నారు. డిఎంఎఫ్ నిధుల ప్రణాళిక అధ్యక్షులుగా ఉన్న జిల్లాధికారి నిధులు వృథాకాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్మిక సమస్యలపై సమావేశం



జనజాగృతి ర్యాలీలో పదాధికారులు

సిరుగుప్ప, జూన్ 30: కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర హమాలీ కార్మిక ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 18న రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు హమాలీ కార్మిక ఫెడరేషన్ కన్వీనర్ తిప్పయ్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు భవిష్యనిధి, ఈఎస్ఐ, బోనస్, పింఛన్ సౌకర్యం కల్పించాలని కరారు. రైస్ మిల్లులు, గోడౌన్‌లు, వేర్ హౌస్‌ల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కార్మికునికి సమావేశ ఉద్దేశం తెలియజేసేందుకు ర్యాలీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా హమాలీ కార్మిక సంఘం ఫెడరేషన్ కార్మిక పదాధికారులు ఓబులేశప్ప, సురేష్, కన్వీనర్ బీఎల్ ఈరణ్ణ, బసవరాజు, ఉలియప్ప, లక్ష్మణ్ణ, నాగరాజు గౌడ, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇనుప గనుల లీజుకు కేఐఓసీఎల్ యత్నం

- వివాదాస్పద బ్లాక్ వదిలి కొత్త మైనింగ్ బ్లాక్‌ను కోరిన కంపెనీ
- గనుల ప్రాంతంలో గ్రేడ్ పరిశీలించేందుకు అటవీ శాఖ అనుమతికి దరఖాస్తు
- పర్యావరణానికి ముప్పు ఉందంటూ నిరాకరణ

బళ్లారి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలోనే అత్యంత మేలు రకం ఖనిజం కలిగిన సండూరు ఇనుప గనుల్లో తవ్వకాలకు కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ(కేఐఓసీఎల్) అటవీ శాఖ అనుమతులను కోరుతూ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తోంది. కాని అందుకు అటవీశాఖ మాత్రం పర్యావరణానికి ముప్పు ఉందంటూ అనుమతులకు కాలడ్డుతోంది.

సండూరు స్వామిమలై ఫారెస్టులో అత్యంత నాణ్యమైన ఇనుప నిక్షేపాలు ఉన్నవిషయం తెలిసిందే. గతంలో కుద్రేముఖ్ సంస్థకు ఈ ప్రాంతంలో దేవదారి ఫారెస్టు బ్లాక్‌లో 434.73 హెక్టార్లలో గనులశాఖ అనుమతి ఇచ్చింది. ఇందులో తవ్వకాలకు అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి. కానీ ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిగితే జరిగే నష్టంపై వివరిస్తూ ఆ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. దీనికి తోడు పత్రికల్లో కూడా దేవదారి ఫారెస్టు బ్లాక్‌లో ఇనుము తవ్వకాలకు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి సంతకం చేసిన విషయం తెలిసిందే.

ఇది వివాదాస్పదం కావడంతో స్వామిమలై అటవీ ప్రాంతంలో అదే సర్వే నంబర్‌లో దేవదారి ఫారెస్టు బ్లాక్‌కు అనుబంధంగా ఉండే హద్దినపాడు బ్లాక్‌లో మైనింగ్ తవ్వకాలకు కేఐఓసీఎల్ కంపెనీకి గనుల శాఖ అనుమతించింది. ఈ ప్రాంతంలోని గనుల్లో ఏ మేరకు ఇనుప ఖనిజం ఉంది. ఎంత లోతు వరకూ తవ్వకాలు చేయవచ్చు అనే అంశంపై సర్వేచేసేందుకు, బోర్లు వేసేందుకు అటవీశాఖను కేఐఓసీఎల్ కంపెనీ అనుమతి కోరింది. హద్దినపాడు ఫారెస్టు బ్లాక్‌లో ఆరు బోర్లు వేయడానికి మాత్రమే వాహనాలు వెళ్లేందుకు దారి ఉందని, మిగిలిన 3 బోర్లువేయడానికి వీలు కాదని అటవీశాఖ పేర్కొంది. 7నుండి 9 వరకూ బోర్లు డ్రిల్లింగ్ సాధ్యం కాదని ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. అటవీశాఖ చట్టం 1980 మార్గదర్శకాల ప్రకారం గనుల సర్వే కోసం అటవీ ప్రాంతంలో కొత్తదారులు నిర్మించకూడదు. అందు వల్ల 7నుండి 9 నంబర్ల బోర్లు వేసేందుకు అనుమతించడం సాధ్యంకాదని అటవీ శాఖ కేఐఓసీఎల్‌కు లేఖ రాసింది.

ఏదైనా కంపెనీ ఒక నిర్దిష్ట ప్రాంతంలో మైనింగ్ ప్రారంభించాలంటే ముందుగా ఖనిజాన్వేషణ చేస్తుంది. ఖనిజాలు ఉన్నాయని తెలిస్తే, ఆప్రాంతంలో తవ్వకాలకు అటవీశాఖ, అలాగే పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. సండూరు ప్రాంతంలోని స్వామిమలై అడవుల్లో ఉండే ఇనుప నిక్షేపాల తవ్వకాలకు గనుల శాఖ వివిధ కంపెనీలకు అనుమతులు ఇస్తుండడంతో దీనిపై అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

ఇంతకు ముందు చిక్‌మగళూరులోని కుద్రేముఖ్ ప్రాంతంలో కేఐఓసీఎల్ తవ్వకాలు చేయగా, అక్కడ నీరు, గాలి, అడవి దెబ్బతినడంతో గనుల లీజును రద్దుచేశారు. ప్రస్తుతం ఇదే కంపెనీ సండూరు అటవీప్రాంతంలోని దేవదారి ఫారెస్టు బ్లాక్‌లో లీజ్ పొందింది. కాని తవ్వకాల అనుమతి విషయంలో అటవీ శాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈనేపథ్యంలో దేవదారి బ్లాక్‌కు సమీపంలో ఉండేహద్దినపాడు ప్రాంతంలో మైనింగ్ కు ప్రయత్నం చేస్తోంది.

పిల్లలను విద్యావంతులుగా చేయాలి



పవిత్రను అభినందిస్తున్న పాత్రికేయ సంఘం అధ్యక్షుడు శివానంద

కంప్లి, జూన్ 30: పాత్రికేయులు ప్రతి ఇంట్లో పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కర్ణాటక కార్యనిరత పాత్రికేయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివానంద్ తగదూర్ తెలిపారు. ఈ సందర్భంగా సంఘం హావేరి జిల్లాలో పాత్రికేయుల పిల్లల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత్రికేయులు తమ పిల్లలను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామానికి చెందిన జీఎం పుష్పవతి, జీఎం బసయ్యస్వామి కుమార్తె జీఎం పవిత్ర పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడంతో ఆమెను సన్మానించారు. అలాగే కంప్లి పాత్రికేయులు అభినందనలు తెలిపారు. మాజీ సీయం బసవరాజు బొమ్మాయి మాట్లాడుతూ పాత్రికేయులు సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లోకేష్, కార్యదర్శి లింగప్ప, జిల్లా అధ్యక్షులు నాగరాజు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- నాగరిక పోరాట కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న సర్జన్ అరవింద్ పటేల్

బళ్లారి సిటీ, జూన్ 30: నగరం పెరగడం వలన మౌలిక సదుపాయాల కూడా పెంచాలని సర్జన్ అరవింద్ పటేల్ కోరారు. నగరంలోని గాంధీభవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బళ్లారి నగరం చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని, అందుకు అనుగుణంగా మున్సిపాలిటీని కూడా మెట్రోపాలిటన్ కార్పోరేషన్‌గా అప్ గ్రేడ్ చేశారన్నారు. కానీ ప్రజావసరాలు మాత్రం విస్తరించలేదన్నారు. నేటికీ దోమల నివారణకు పాగింగ్ చేయడం లేదన్నారు. స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం సాధారణ ప్రజలు డెంగ్యూబారిన పడుతున్నారన్నారు. దీనిపై ప్రజలు పోరాడాల్సిన అవసరముందన్నారు. తదుపరి ప్రఖ్యాత యూరాజిస్ట్ గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్ళు గడుస్తున్నా కనీస వసతులు లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, ఇది చాలా సిగ్గుచేటన్నారు. నగరంలో రోడ్డునిర్మాణ పనులు శాస్త్రీయంగా జరగడం లేదని, దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఇండ్లలోకి నీరు చేరి వర్షాకాలంలో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఇలాంటి అయోమయానికి వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలన్నారు. బీఎన్‌హెచ్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ సోమశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండా నగరపాలక సొమ్మును స్వార్థ ప్రయోజనాల కోసం అనవసర ప్రాజెక్టులకు వెచ్చిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నగర ప్రజలు భారీ పోరాటానికి సిద్ధం కావాలన్నారు.

ట్యాంకుల్లో నీరు నిల్వ చేయవద్దు

కంప్లి, జూన్ 30: పట్టణాల్లో గ్రామాల్లో తమ ఇంటి వద్ద వుండే సింటెక్స్ ట్యాంకర్లలో, గుంతల్లో నీటిని నిల్వ వుంచకుండా జాగ్రత్త వహించాలని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఇప్పటికే డెంగ్యూ, మలేరియా వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని, తమ ఇళ్ల ముందు నీటిని నిల్వ వుంచుకోవడం వల్ల జ్వరాలు మరింతగా ప్రబలే ఆస్కారముందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కొద్దిపాటి జ్వరాలు ప్రబలినా వెంటనే తమ వద్ద వుండే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలని సూచించారు. వారితో పాటు ఆరోగ్య శాఖ అధికారులు వీరేష్, బసవరాజు, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పతనావస్థలో పుస్తక ముద్రణ..!



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీరేశ్ సౌద్రి

రాయచూరు, జూన్ 30: సామాజిక మాధ్యమం విజృంభిస్తున్న నేటి సమాజంలో పుస్తక ముద్రణ, పఠనాసక్తి పతనావస్థకు చేరాయని సీనియర్ పాత్రికేయుడు దేవనంప్రియ పబ్లిషింగ్ అధిపతి, పాత్రికేయుడు వీరేశ్ సౌద్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మంగళమూర్తి రచించిన రెండు పుస్తకాలను ఆదివారం నగరంలోని కన్నడ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరేశ్ సౌద్రి, కవులు, సాహితీవేత్తలు, పండితులు తాము రచించిన వ్యాసాలను కవిత్వాలను సోషల్ మీడియా ద్వార విడుదల చేయడం వలన పుస్తక ముద్రణ సమస్యగా మారిందన్నారు. నిజంగా కొంతమంది పుస్తక ముద్రణ చేయాలనుకున్నా ఆర్థికంగా వారికి ఎదురయ్యే కష్టాలు వర్ణనాతీతమన్నారు. హంపి విశ్వవిద్యాలయం ఉపకులపతి మాట్లాడుతూ నేటి పాఠకుల్లో సహితం పుస్తక పఠనం కంటే సోషల్ మీడియాలో వచ్చే వార్తలను వినడానికే ఎక్కువ మంది ప్రాధాన్యతనిస్తుండడం దురదృష్టకరమన్నారు. పుస్తక పఠనం పట్ల ప్రతి ఒక్కరు ఆసక్తి పెంచుకోవాలన్నారు.

నేరేడు పండ్లకు పెరిగిన డిమాండ్



పండ్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు

బళ్లారి సిటీ,జూన్ 30: మామిడి తరువాత పండ్లలో రారాజుగా నిలిచిన పండు నేరేడు. ఆ పండు ఇప్పుడు మార్కెట్లోకి వచ్చింది. సీజనల్ ఫ్రూట్ కావడంతో ప్రస్తుతం దీనికి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. మార్కెట్లో కిలో రూ.100నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. ఈ పండు రుచికరమైనది, ఆరోగ్యానికి మంచిది కావడంతో ఖరీదు అయినప్పటికీ ప్రజలు ఆనందంగా కొనుగోలు చేస్తున్నారు. ఈపండు అన్ని వేళలా అందుబాటులో ఉండదు. అలాగే రైతులందరూ పెంచరు. సాధారణంగా జూన్, జూలైలో మాత్రమే పంట వస్తుంది. అందుకే దీని ధర ఎక్కువ అని వ్యాపారులు చెబుతున్నారు.

ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ప్రమోదు మాట్లాడుతూ, నేరేడు పండులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, గుండె సంబంధిత వ్యాధులకు ఈ పండు దివ్యౌషధమన్నారు. ఇందులో ఐరన్ పుష్కలంగా ఉంటుందని, మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఉపయోగపడుతుందన్నారు. రక్తాన్ని శుద్ధి చేసే శక్తి కూడా దీనికి ఉందని చెప్పారు. ఈ పండును జ్యూస్‌గా కూడా తీసుకోవచ్చునని, దీనిలో కాల్షియం, పొటాషియం, ఐరన్, విటమిన్ సీ ఎక్కువగా ఉంటాయన్నారు. ఇది శరీరంలోని రక్తంలో హీమోగ్లోబిన్‌ను పెంచుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈపండు గుజ్జును వైన్, వెనిగర్, జెల్లీ జామ్ తయారీలో ఉపయోగిస్తారంటున్నారు. ఇది శరీరాన్ని ఎప్పుడు తేమగా ఉంచుతుందని ఆయన పేర్కొన్నారు.

హోసూరు జోన్

పట్టణంలోకి కొండముచ్చులు



కుక్కల బెడదకు జిల్లా కమిషనర్ కార్యాలయానికి చేరిన కొండముచ్చు

హోసూరు, జూన్ 30: అడవి నుంచి దారి తప్పిపోయిన కొండముచ్చు కోతులు అడవి నుంచి పట్టణంలోకి వచ్చాయి. అనేక రకాల కోతులు ఉన్నప్పటికి కావేరి దక్షిణ-ఉత్తర భాగంలో చాలా తక్కువగా కొండముచ్చు కోతులు ఉన్నాయి. వీటిని పొడవాటి తోకగల లంగూర్ అని కూడా అంటారు. ఏనుగులు, చిరుతపులులు, ఎలుగుబంట్లు, లేళ్ళు, వివిధ జాతుల పక్షులు, కోతులు హోసూరు ఫారెస్ట్ ఉత్తర, దక్షిణ వన్యప్రాణుల అభయారణ్యాలలో ఉన్నాయి. ఈ అభయారణ్యం-కర్ణాటక రాష్ట్రం అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో అడవి జంతువులు ఆహారం, నీరు వెతుక్కుంటూ రెండు రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల సమీప గ్రామ, పట్టణ ప్రాంతాల్లోకి వెళ్లడం సర్వసాధారణం. ఇలా ఆదివారం హోసూరు ప్రాంతంలోని జిల్లా కమీషనర్ కార్యాలయ ఆవరణలోకి కోతులు వచ్చాయి. ఎందుకంటే ఆక్కడున్న వీధికుక్కలు వెంటాడి తరుముతున్నాయి. దీంతో ప్రజలు కూడా భయపడుతున్నారు. కొండముచ్చు కోతులను అడవిలోకి వదలాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లలకు విటమిన్ 'ఏ' సిరప్ పంపిణీ

హోసూరు(కృష్ణగిరి), జూన్ 30: కృష్ణగిరి జిల్లాలో జులై నెల పొడవునా ఆరు నెలలనుంచి ఐదేళ్లలోపు వారికి విటమిన్ ఏ సిరప్ పంపిణీ చేయనున్నట్టు కలెకర్ సరయు తెలిపారు. ప్రజా, కుటుంబ సంక్షేమ శాఖ తరపున పిల్లల కోసం జాతీయ విటమిన్-ఏ లోప నివారణ కార్యక్రమం క్రింద విటమిన్-ఏ లిక్విడ్ పంపిణీ శిబిరాలు ఉంటాయన్నారు. కృష్ణగిరి జిల్లాలో 6 నెలల నుంచి 5 ఏళ్లలోపు వయస్సున్న 1,42,082 మంది పిల్లలకు అన్ని ఉప ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విటమిన్-ఏ లిక్విడ్‌ను ఇవ్వనున్నట్టు తెలిపారు. పిల్లల శారీరక, మానసిక మేథో వికాసానికి విటమిన్-ఏ ఒక ముఖ్యమైన సూక్ష్మపోషకమని, మెరుగైన కంటి చూపు కోసం విటమిన్ -ఏ కూడా చాలా అవసరమన్నారు. 6 నుంచి 11 నెలల వయస్సు వారికి 1మి.లీ., 12 నెలల నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు మోతాదు 2 ఎంఎల్ మోతాదు విటమిన్-ఏ సిరప్ ఇవ్వాల్సి ఉంటుందని ఎలాంటి దుష్ప్రభావం ఉండదన్నారు.

మళ్లీ పెరిగిన బీన్స్ ధర

హోసూరు, జూన్ 30: హోసూరు రైతు బజారు రిటైల్ మార్కెట్లలో బీన్స్ ధర ఒక్కసారిగా పెరిగింది. మార్కెట్‌లో ఆదివారం కిలో బీన్స్ ధర రూ.120 పలికింది. 2 నెలల క్రితం రైతుబజారులో కిలో బీన్సు రూ.30 ఉండగా అనంతరం రూ.45 కు పెరిగింది. ప్రస్తుతం హోసూరు రైతుబజారులో రూ.100 నుంచి రూ.120 కి వచ్చింది. తమిళనాడులోని ఊటీలో పండే బీన్సు కోయంబత్తూర్, ఈరోడ్, సేలం, జిల్లాలకు ప్రజల అవసరాలను తీరుస్తున్నాయి. కొడైకెనాల్‌లో పండే బీన్స్ మధురై, తిరుచ్చి జిల్లాల అవసరాలకు అందుతుంది. చెన్నైకి, కర్ణాటక రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రం నుంచి బీన్స్ అందుతాయి. హోసూరు పరిసర ప్రాంతాల నుంచి బీన్స్ హోసూరు రైతు మార్కెట్‌కు రోజూ వస్తుంటాయి. బీన్స్ ధర పెరగడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పురోగతిలో బ్రాహ్మణుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వసంత్‌కుమార్

రాయచూరు, జూన్ 30 : సమాజ పురోగతి, దేశ అభివృద్ధిలో బ్రాహ్మణులు కీలక పాత్ర పోషిస్తారని ఎమ్మెల్సీ ఎ.వసంత్‌కుమార్ అన్నారు. పుట్టుకతోనే స్వతహాగానే విజ్ఞానవంతులుగా ఉండే బ్రాహ్మణుల్లో మేథో సంపదతో పాటు పరిశ్రమించే గుణం ఉండడం అభినందనీయమన్నారు. అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రంగ మందిరంలో విప్రశ్రీ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎ.వసంత్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పుట్టుకతోనే మేధావంతులుగా ఉండే బ్రాహ్మణులు ఐఏఎస్, ఐపీఎస్ ర్యాంకులతో దేశంలోని అత్యున్నత పదవుల్లో ఉండడాన్ని ప్రస్తావించారు. అదే సమయంలో బ్రాహ్మణుల్లో సాహిత్య పఠనాసక్తి ఎక్కువేనన్నారు. ప్రతిభావంతులకు విప్రశ్రీ అవార్డులను అందజేశారు.

టీఈటీ పరీక్షలకు 724 మంది గైర్హాజరు

రాయచూరు, జూన్ 30: జిల్లా కేంద్రం రాయచూరు నగరంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయఅర్హత పరీక్ష టీఈటీకి 724 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. నగరంలో ఏర్పాటు చేసిన మొత్తం 32 కేంద్రాల్లో 5,560 మంది అభ్యర్థులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోగా 4,836 మంది అభ్యర్థులు మినహా మిగిలినవారంతా గైర్హాజరైయ్యారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీగా ముందుజాగ్రత చర్యలు చేపట్టారు. అన్ని కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పరీక్షల నిర్వహణల సందర్భంగా అన్ని కేంద్రాల్లోను వీడియో చిత్రీకరణ చేపట్టారు. పలు కేంద్రాలను డీడీపీఐ ఇతర విద్యాశాఖ అధికారులు పరిశీలించారు.



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఏడీసీ దుర్గేష్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బీసీ రాయ్ (జయంతి, వర్ధంతి)




భారతరత్న గ్రహీత బిధాన్ చంద్ర రాయ్ 1882 జూలై 1న పాట్నా ప్రాంతంలో జన్మించారు. ఫిజీషియన్, విద్యావేత్త, మానవతావాది, స్వాతంత్ర్య సమర యోధుడు, దార్శనికుడు. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి 1948 నుంచి తుదిశ్వాస దాకా అంటే 1962 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. దుర్గాపూర్, కల్యాణి, బిధాన నగర్, అశోక్ నగర్, హబ్రా లలో విద్యాసంస్థలు ఏర్పాటు కావడంలో కీలక పాత్ర పోషించారు. ఎఫ్ఆర్‌సీఎస్, ఎంఆర్‌సీపీలను ఒకేసారి పొందిన అరుదైన వ్యక్తులలో ఒకరు. వైద్య రంగంలో ఆయన సేవలకు గుర్తుగా 'నేషనల్ డాక్టర్స్ డే'ను ఆచరిస్తున్నారు. కాగా వైద్య, రాజకీయ, సైన్స్, ఫిలాసఫీ, సాహిత్యం, ఆర్ట్స్‌లలో రాణించిన వారికి బీసీ రాయ్ నేషనల్ అవార్డులు కూడా ఇస్తున్నారు. 80వ యేట 1962 జూలై 1న కన్నుమూశారు. ఇలా ఒకే తేదీన బీసీ రాయ్ జయంతి, వర్ధంతి రావడం కాకతాళీయం.

ఇంటూరి వెంకటేశ్వరరావు (జయంతి)



ఇంటూరి వెంకటేశ్వరరావు 1909 జూలై 1న గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మూడేళ్లకుపైగా కారాగార శిక్ష అనుభవించారు. అనంతరం తెలుగు సినిమా చరిత్ర పరిశోధకుడిగా రాణించారు. సుమతి, మాయలోకం, పేదరైతు, లక్ష్మీ, సక్కుబాయి, నాగపంచమి తదితర సినిమాలకు సహాయక దర్శకులుగా పనిచేశారు. ఆయన సృష్టించిన కుమ్మరి మొల్ల కావ్యం నాటకం, రేడియో నాటకం, బుర్రకథ, సినిమాగా వెలుగుచూసింది. తెలుగులో ప్రప్రథమ సినిమా మాసపత్రిక 'చిత్రకళ'ను 1937లో ప్రారంభించారు. ఐదు దశాబ్దాలపాటు ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. రఘుపతి వెంకయ్య అవార్డు, కళాప్రపూర్ణ బిరుదు పొందారు. 2002 మే 7న కన్నుమూశారు.

కేవీ రెడ్డి (జయంతి)




కేవీ రెడ్డిగా సుపరిచితులైన కదిరి వెంకట రెడ్డి 1912 జూలై 1 అనంత పురం జిల్లా తాడిపత్రిలో జన్మించారు. తెలుగు సినిమా స్వర్ణ యుగంగా భావించే కాలంలో విజయ వంత మైన, విమర్శకులు సైతం ఆణిముత్యాలుగా అభివర్ణించిన పలు సినిమాలు తీసిన దర్శకుడు. 14 సినిమాలు తీయగా 10 వాణిజ్యపరంగా విజయం అందుకున్నాయి. దర్శకుడు, నిర్మాత, రచయిత, ప్రొడక్షన్ మేనేజర్‌గా రాణించారు. భక్త పోతన, పాతాళ భైరవి, మాయాబజార్, దొంగ రాముడు, శ్రీకృష్ణసత్య సినిమాలు సూపర్‌హిట్‌గా నిలిచాయి. ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ దర్శకుడి అవార్డు పొందారు. 1972 సెప్టెంబరు 15న కన్నుమూశారు.

ప్రిన్సెస్ డయానా (జయంతి)



వేల్స్ యువరాణి డయానా 1961 జూలై 1న జన్మించారు. బ్రిటీష్ రాజ కుటుంబానికి చెందిన చార్లెస్ మొదటి భార్య. బ్రిటీష్ రాజకుటుంబంలో తనదైన గుర్తింపు పొందారు. ప్రిన్స్ విలియమ్, ప్రిన్స్ హ్యారీలకు తల్లిగాను గుర్తింపు పొందారు. సామాజికసేవా కార్యక్రమాలతో పాటు ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. 36వ యేట 1997 ఆగస్టు 31న కన్నుమూశారు.

ఎం. వెంకయ్యనాయుడు (పుట్టినరోజు)




భారత 13వ ఉపరాష్ట్రపతిగా వ్యవహరించిన ముప్పవరపు వెంకయ్య నాయుడు 1948 జూలై 1న నెల్లూరు జిల్లాలోని చవటపాలెం గ్రామంలో జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లా పట్టా పొందిన ఆయన సమాజంలో అణగారిన వర్గాలు, రైతుల కోసం శ్రమించారు. సామాజిక కార్యకర్తగా పాలలోనూ, రాజకీయాల్లోనూ రాణించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. 2019లో గౌరవ డాక్టరేట్ సహా పలు గౌరవాలు అందుకున్నారు.

హరిప్రసాద్ చౌరాసియ (పుట్టినరోజు)



పద్మ విభూషణ్ గ్రహీత హరిప్రసాద్ చౌరాసియా 1938 జూలై 1న అలహాబాద్‌లో జన్మించారు. హిందూస్థానీ సంగీతంలో ఫ్లూటిస్ట్ (వేణు వాదకులు)గా ఎంతో పేరొందారు. జానపద, ఉత్తర భారతీయ శైలి, పాశ్చాత్య సంగీత శైలిలోనూ రాణించారు. ముంబై, భువనేశ్వర్‌లలో బృందావన్ గురుకుల్ ఏర్పాటు చేసి ప్రాచీన గురు కులం విధానంలో సంగీతాన్ని నేర్పిస్తున్నారు. పద్మ భూషణ్, సంగీత నాటక అకాడమీ, కోనార్క్ సమ్మాన్, పూనె పండిట్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

కొలకలూరి ఇనాక్ (పుట్టినరోజు)



తెలుగు రచయిత కొలకలూరి ఇనాక్ 1939 జూలై 1న గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామంలో జన్మించారు. సాహితీకారుడు, కవిగా రాణించారు. తెలుగు పదాలకు వెలుగు అద్దిన పద నిర్దేశి. ఆధునిక సాహిత్య ప్రక్రియలో అన్ని రూపాలను చవిచూపిన రచయిత. ఉపాధ్యాయుడిగా, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. 2014లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 'అనంత జీవనం' రచనకు మూర్తిదేవి పురస్కారం పొందారు.

నూతన డెయిరీ భవనానికి కృష్ణప్ప పేరు

బంగారపేట, జూన్ 30: రాష్ట్రంలో పాలవిప్లవం కోసం శ్రమించిన దివంగత ఎంపీ కృష్ణప్ప పేరును నూతన డెయిరీకి నామకరణం చేసేలా తీర్మానించినట్టు కేఎంఎఫ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. బంగారపేట పట్టణ శివారులో కోలారు - చిక్కబళ్ళాపుర జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన భవనాన్ని బంగారపేట ఉప కార్యాలయంలో ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నా అని అకస్మికంగా సహకార సంఘం డైరెక్టర్‌గా, సమాఖ్య అధ్యక్షుడిగా అయ్యానన్నారు. అధ్యక్షుడు అయ్యాక జిల్లాకు ఏదైనా శాశ్వతంగా చేపట్టాలని తీర్మానించానన్నారు. మన ప్రాంత డెయిరీ పాత యంత్రాలతో, పాతభవనంలో ఉండేదని, ఆధునిక సాంకేతిక పాలడెయిరీ కోసం మైత్రి ప్రభుత్వంలో అనుమతి లభించిందన్నారు. నూతన డెయిరీ భవనానికి ఎంపీ కృష్ణప్ప పేరు పెట్టేలా పాలకవర్గం ఆమోదం పొందినట్టు తెలిపారు. పనుల ప్రారంభం వేళ ప్రభుత్వం మారిందని, దీంతో జాప్యమైందన్నారు. సిద్దరామయ్య ముఖ్యమంత్రి అయ్యాక తిరిగి పనులు పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో నందిని బ్రాండ్‌కు మంచి ఆదరణ ఉందని, మండ్య లేదా హాసన్ జిల్లాల్లో మాత్రమే పురోగతిలో ఉండేదన్నారు. కోలారు జిల్లాకు సోలార్ విభాగం, చిక్కబళ్ళాపుర జిల్లాకు ఐస్‌క్రీమ్ విభాగాలు కేటాయించబడ్డాయన్నారు. ఎమ్మెల్యే, కేయూడీఐఎఫ్‌సీ అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ దేశంలో ప్రముఖ నాయకులను స్మరించుకోవాలన్నారు. బీజీఎంఎల్ ఫ్యాక్టరీ స్థాపనలో కృష్ణప్ప పాత్రను గుర్తు చేసుకున్నారు. లక్షలాదిమందికి ఉద్యోగ ఉపాధి లభించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నజీర్ అహ్మద్, అనిల్‌కుమార్, డైరెక్టర్‌లు జయసింహ, కృష్ణప్ప, కెన్ నాగరాజ్, డీవీ హరీశ్, హనుమేశ్, కాంతమ్మ, అంజని సోమణ్ణ తదితరులు పాల్గొన్నారు.



నూతన డెయిరీ ప్రారంభంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు

నిరంతర శ్రమతోనే విద్యార్థులకు భవిష్యత్తు

▸▸ పీఈఎస్ ప్రొ-చాన్స్‌లర్ జవహర్



టాపర్ విద్యార్థులు, కళాశాల ముఖ్యులు తదితరులు

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని నిరంతర శ్రమతోనే భవిష్యత్తు ఉంటుందని పీఈఎస్ యూనివర్సిటీ ప్రొ - చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి జవహర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం 2024-25 సంవత్సరానికి పాలిటెక్నిక్‌కు అనుబంధమైన మొదటిసంవత్సరం డిప్లమో తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. పీఈఎస్ యూనివర్సిటీలో ఏర్పాటైన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి జవహర్ మాట్లాడుతూ నిరంతర శ్రమకు ఫలితమనేది ఉంటుందన్నారు. పీఈఎస్ యూనివర్సిటీ 50ఏళ్లక్రిందట ఓ వ్యాయామశాలలో ఆరంభమైందని ప్రస్తుతం ఉన్నత విద్యారంగంలో రాష్ట్రంలోనే కీలకమైనదిగా రాణిస్తోందన్నారు. మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. డిప్లమో చదువుతున్నామనే నిరుత్సాహం అవసరం లేదన్నారు. ఇక్కడి విద్యార్థులు ఇంజనీరింగ్, మెడికల్ వారితో సమానంగా ఎదగవచ్చునన్నారు. అకడమిక్‌తో పాటు మెంటరింగ్, యోగాకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. శ్యామ్‌సర్ ఇంజనీరింగ్ లిమిటెడ్ జాయింట్ ఎండీ సంఘ్వి ఎఫ్ఆర్ ఉత్తమ విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. వందకు వందమార్కులు సాధించిన 12మంది విద్యార్థులకు పుస్తకాల కూపన్‌లను అందచేశారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్, హనుమంతనగర్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హెచ్ఎన్ దేవరాజ్‌లు పాల్గొన్నారు.

తీవ్రమవుతున్న ఆర్థో సమస్యలు

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థో సమస్యలు ఎదుర్కొనే ప్రజలు పెరుగుతున్నారని అందుకు పలు కారణాలు ఉన్నాయని నరేశ్‌పురి మహారాజ్ స్వామిజీ అభిప్రాయపడ్డారు. సక్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐకేటీసీ పేరిట మోకాలి, ఆర్థోపెడిక్ సెంటర్‌ను ప్రారంభించారు. రాజస్థాన్ దౌసాలోని ఘటమెహందీపుర్ బాలాజి ట్రస్టు అధ్యక్షులు నరేశ్‌పురి మహరాజ్ స్వామిజీ అభిప్రాయపడ్డారు. రామకృష్ణ మిషన్ ట్రస్టు సభ్యుడు స్వామి ముక్తదానంద ముఖ్యులుగా పాల్గొన్నారు. సక్ర ఆసుపత్రి ఎండీ యుచి నగానో, డీఎండీ నయోయా ముక్సిమి, సీఓఓ లవకేశ్‌పాశు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేశ్‌పురి మహరాజ్ మాట్లాడుతూ వైద్యరంగంలో ఆధునీకరణ విధానాలు రావడం సంతోషమన్నారు. అయితే సామాన్యులకు సేవలు సరళీకృతం అనేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐకేటీసీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలో ఇదో అత్యుత్తమ ఆర్థోపెడిక్ సెంటర్ కానుందన్నారు. 50పడకల సూపర్‌స్పెషాలిటీ, 4 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌లు, 8 ఐసీయూ పడకలు, 6 ఎమెర్జెన్సీ బెడ్‌లు ఇతరత్రా సదుపాయాలు ఉన్నాయన్నారు.



నరేశ్‌పురి మహరాజ్ స్వామిజీ తదితరులు

వీరప్పమొయిలీ కుమార్తె హంసమొయిలీ కన్నుమూత

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్పమొయిలీ కుమార్తె హంస మొయిలీ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హంసమొయిలీ శనివారం రాత్రి బెంగళూరులో తుదిశ్వాస వీడారు. విషయం తెలియగానే ఛత్తీస్‌ఘడ్‌లో ఉన్న వీరప్పమొయిలీ రాత్రే వాపసు వచ్చారు. హంస మొయిలీ అంత్యక్రియలు సోమవారం నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించినట్టు సమాచారం. హంస మొయిలీ భరతనాట్య కళాకారిణిగా గుర్తింపు పొందారు. హంసమొయిలీ మృతి పట్ల డీసీఎం డీకే శివకుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రతిభావంత నృత్య కళాకారిణిగా హంస రాణించారని, చిన్నవయస్సులోనే తుదిశ్వాస వీడడం బాధాకరమన్నారు. తండ్రి వీరప్పమొయిలీ లాగే సమాజంలో చిట్టచివరి వ్యక్తి వరకు అన్ని హక్కులు దక్కాలని కలలు కన్నవారని కొనియాడారు. దేవదాసి జీవన విధానం ఆధారంగా తమిళ సినిమా శృంగారంలో నటించారన్నారు. 46 ఏళ్ల హంస ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్నారన్నారు. ఎదిగిన కుమార్తె కన్నుమూయడం తండ్రికి ఎనలేని బాధ అన్నారు. మొయిలీ కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని దేవుడుని ప్రార్థిస్తున్నట్టు సందేశంలో శివకుమార్ అభిప్రాయపడ్డారు.



హంస మొయిలీ (ఫైల్)

ఆదర్శప్రాయుడు కెంపేగౌడ

మహదేవపుర, జూన్ 30: నాడప్రభు కెంపేగౌడ దూరదృష్టి కారణంగానే బెంగళూరు నగరం సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు వీలైందని, ఆదర్శప్రాయులని మాజీ మంత్రి అరవింద లింబావళి కొనియాడారు. నింబేకాయపురలోని జనపదరు రంగమందిరంలో కెంపేగౌడ 515వ జయంతిలో పాల్గొని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. నగరాలతోపాటు గ్రామీణ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందాలన్నారు. నగర ప్రజలకు లభించే సదుపాయాలు గ్రామీణులకు కూడా అందాలని ఆకాంక్షించారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్‌తో గ్రామాలలోని ప్రతి ఇంటికి తాగునీరు అందనుందన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు పొందినవారికి ప్రతిభాపురస్కారాలతో సన్మానించారు. ప్రత్యేక అధికారిగా వ్యవహరించి రిటైరైన బీవీ ప్రసాద్‌ను కూడా ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మనోహరరెడ్డి, నటరాజ్, కెంపేగడ సమితి సభ్యులు హరాడి పిళ్ళప్ప, మండూరు కెంపేగౌడ, మంజునాథ్, రాజేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కెంపేగౌడ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి అరవింద లింబావళి తదితరులు

గురుపూజా సంగీతోత్సవ ఆహ్వాన పత్రిక విడుదల

చింతామణి, జూన్ 30: తాలూకాలోని ప్రసిద్ధ యాత్రాస్థలమైన కైవార క్షేత్రంలోని యోగి నారేయణమఠంలో జులై 19 నుంచి 21వరకు జరిగే జాతీయస్థాయి సంగీతోత్సవం, గురుపూజా మహోత్సవానికి సంబంధించిన ఆహ్వానపత్రికను లాంఛనంగా విడుదల చేశారు. సద్గురు యోగి నారేయణ తాతయ్య సన్నిధిలో ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం ప్రత్యేక పూజల అనంతరం ఆహ్వానపత్రిను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఆర్ జయరాం మాట్లాడుతూ మూడురోజులపాటు 72 గంటల నిరంతర సంగీతోత్సవం ఉంటుందన్నారు. సంకీర్తనా ప్రాజెక్టు సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతర్, మఠం ట్రస్టు ఉపాధ్యక్షులు జే విభాకర్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



యోగినారేయణ సన్నిధిలో ఆహ్వానపత్రిక విడుదల

దళారులను నమ్మి మోసపోవద్దు

పెనుకొండ రూరల్, జూన్ 30 : రైతులు పండించిన పంటలను నేరుగా మార్కెట్‌లోనే విక్రయించాలని, దళారుల చేతిలో మోసపోవద్దని సీసీడీ సంస్థ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ త్రిలోచనా శాస్త్రి సూచించారు. మండలంలోని గుట్టూరు సమీపంలో ఆదివారం సీసీడీ శ్రీసత్య సాయి రైతు పరస్పర సహాయక సహకార పరిమిత సమాఖ్య వేరుశనగ మిల్లులో 14వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. జిల్లాలోని రైతులు, ఇతర రాష్ట్రాల నుంచి ఎన్‌జీఓలు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ త్రిలోచనా శాస్త్రి మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలో 33మండలాల్లోని 379గ్రామాల్లో 229 రైతు సహకార సంఘాలు ఏర్పడి, సభ్యులు ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. రైతులు కలిసికట్టుగా ఉండి తాము సాగుచేసిన పంటలను ప్రాసెసింగ్‌చేసి మార్కెట్‌లో మంచి ధరలు పొందవచ్చన్నారు. అనంతరం సమాఖ్య మిల్లుల నూతన పాలక వర్గాన్ని ఎన్నుకుని వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల నుంచి 2500 మంది రైతులు పాల్గొన్నారు. సమావేశంలో ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, రమణారెడ్డి, అశ్వత్థరెడ్డి, సీసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

మానస సరోవర యాత్రికులకు ప్రోత్సాహకం

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మానస సరోవర యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. ఈ మేరకు మార్గదర్శకాలను విడుదల చేసింది. సరోవర, చార్‌ధామ్ యాత్రికులకు ప్రోత్సాహకధనం అందించనున్నారు. మానస సరోవరను సందర్శించే యాత్రికులకు రూ.30వేలు, చార్‌ధామ్ (గంగోత్రి, మునోత్రి, కేదార్‌నాథ్, బద్రినాథ్) యాత్రికులకు రూ.20వేలు చొప్పున, కాశీ యాత్ర చేసేవారికి కూడా రూ.5వేలు సహాయధనం చేస్తారు. కర్ణాటకకు చెందిన వారు మాత్రమే ప్రోత్సాహకం పొందేందుకు అర్హులు. ఓటరు గుర్తింపు కార్డు లేదా ఆధార్‌కార్డును అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 45 ఏళ్ల పైబడినవారు మాత్రమే ప్రోత్సాహకం పొందేందుకు అర్హులుగా ఉంటారు. 45 ఏళ్ల పైబడిన యాత్రికులు వయస్సు నిర్ధారణకు సంబంధించి ఆధారాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి మాత్రమే ప్రోత్సాహకధనాన్ని పొందేందుకు వీలుంటుందని మార్గదర్శకాలలో పేర్కొన్నారు.



కబ్బన్‌పార్క్‌లో సంస్కృత శిక్షణపై ప్రస్తావన

▸▸ 'మన్ కీ బాత్'లో ప్రధాని ప్రశంసలు

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతినెలా రేడియో ద్వారా సాగిస్తున్న మన్ కీ బాత్ కొన్ని నెలల తర్వాత పునః ప్రారంభించారు. ఆదివారం మన్ కీ బాత్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల అంశాలను ప్రస్తావించారు. బెంగళూరు కబ్బన్‌పార్క్‌లో వారాంతంలో సాగే సంస్కృత సమీక్ష కింభో కార్యక్రమాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. పురాతన భాష సంస్కృతాన్ని యువతకు పరిచయం చేసే దిశగా సమిష్టిగుబ్బి వారాంతంలో సంస్కృత సమీక్ష కింభోను ఆరంభించారు. ఆకాశవాణి సంస్కృత బులెటిన్ 50ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని గుర్తు చేశారు. బెంగళూరు కబ్బన్‌పార్క్‌లో కొత్త సంప్రదాయాన్ని తీసుకొచ్చారన్నారు. వారాంతంలో పిల్లలు, యువత, వృద్ధులు అనే తేడా లేకుండా సంస్కృతంలో మాట్లాడడం, సమీక్షలు జరుపుతారని దీన్ని సంస్కృత వారాంతం అంటూ కొనియాడారు. బైక్‌రైడ్‌తోపాటు పలు ఆన్‌లైన్ తరగతుల ద్వారా సంస్కృతభాషను ప్రచారం చేస్తున్నారని, ప్రజలు సంస్కృతాన్ని విద్వాంసుల భాషగా భావిస్తారన్నారు. ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగిస్తారన్నారు. మనం స్టీరియో టైప్‌లను వీడి ఆధునిక, దైనందిన సందర్భాలలోనూ సంస్కృతాన్ని ఉపయోగించవచ్చునని సమిష్టి ప్రచారం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

అధిష్ఠానం నిర్ణయిస్తే డీకే శివకుమార్ సీఎం

▸▸ జేడీఎస్ నేత జీటీ దేవెగౌడ



జీటీ దేవెగౌడ

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తే డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని జేడీఎస్ నేత జీటీ దేవెగౌడ అభిప్రాయపడ్డారు. మైసూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ వీక్‌గా ఉన్నప్పుడు సిద్దరామయ్య స్ట్రాంగ్‌గా ఉండేవారని, ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానం స్ట్రాంగ్‌గా ఉందని సిద్దరామయ్య కూడా అధిష్ఠాన నిర్ణయాన్ని పాటించాల్సి ఉంటుందన్నారు. కాబట్టి అధిష్ఠానం మనసుపెడితే డీకే శివకుమార్‌కు కీలకపదవి దక్కుతుందన్నారు. ఒక్కలిగస్వామిజీ అభిమానంతో వ్యాఖ్యానించారన్నారు. కానీ పవర్‌షేరింగ్ అనేది కాంగ్రెస్ గెలుపొందినప్పటి నుంచి చర్చ జరుగుతున్న విషయం తెలిసిందేనన్నారు. 15సార్లు ఆర్థిక మంత్రిగా బడ్జెట్ ప్రవేశపెట్టిన సిద్దరామయ్య సడెన్‌గా కిందకు దిగుతారనేది చెప్పలేమన్నారు.

కలెక్టరేట్‌లోనే పరిహారం చెక్కులు

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలకు ముందే కురిసిన వర్షాల వేళ పిడుగుపాటుకు మృతి చెందిన ఇరువురు కూలీల వారసులు స్పందించకపోవడంతో దక్షిణకన్నడ జిల్లా కలెక్టరేట్ చెంతనే 10 లక్షల రూపాయల పరిహారం చెక్కులు మిగిలిపోయాయి. కడబ వద్ద ఇసుకతవ్వకాలు చేపడుతున్న ఉత్తరప్రదేశ్‌కార్మికులు ఇద్దరు పిడుగు పడ్డంతో మృతి చెందారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. అందుకు అనుగుణంగానే కలెక్టరేట్ కార్యాలయం చెక్కులను సిద్ధం చేసింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివాల్‌మత్య గోపాల్ మే 11న, రాజ్‌కుమార్ చౌదరి మే 22న మృతి చెందారు. బంధువులు వచ్చి ఉత్తరప్రదేశ్‌కు తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపారు. అయితే పరిహారం కోసం ఎవరూ రాలేదని జిల్లా కలెక్టరేట్ ప్రకటించింది.

రూ.11 లక్షల నగదుతో వీహెచ్ఏ పరారీ

కుందుర్పి, జూన్ 30: మండలంలోని జంబుగుంపల రైతు భరోసా కేంద్రంలో వీహెచ్ఏగా పనిచేస్తున్న ప్రవీణ్ రాయితీ విత్తనాలు విక్రయించిన రూ.11,23,420 సొమ్ముతో పరారయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆదివారం మండల వ్యవసాయ అధికారి స్థానిక కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవసాయ అధికారి తెలిపిన మేరకు జంబుగుంపల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేశారు. అందుకు సంబంధించిన నగదును రూ.17,23,420 విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అందులో రూ.5.9 లక్షలు మాత్రమే చెల్లించాడు. మిగిలిన సొమ్మును జమ చేయలేదు. 15 రోజులుగా అతను అందుబాటులోకి రాకపోవడంతో వ్యక్తిగత సమస్యలతో సెలవులో ఉన్నారని అధికారులు భావించారు. ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో అనుమానంతో మండల వ్యవసాయ అధికారి మహేష్ అప్రమత్తమై ఎస్ఐ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

